యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

-జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్, జూన్ 21 : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా గనులు, ఓసీపీపై కార్మికులు, అధికారులు యోగా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్‌లో జీఎం సంజీవ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి యోగా దినోత్సవాన్ని ప్రారంభించారు. జీఎం సంజీవరెడ్డి మాట్లాడుతూ యోగా చేయడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు సాంబయ్య, బక్కయ్య జీఎం ఆఫీస్ ఉద్యోగులు, ఎస్‌వోటూజీఎం పురుషోత్తంరెడ్డి, ఏజీఎం మురళీధర్, డీవైజీఎం అరవిందరావు, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్ రావు, డీవై జీఎం చిరంజీవులు, సీనియర్ పీవో కాంతారావు, ఐటీ ప్రొగ్రామర్ శ్రీనివాస్, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఎస్ఆర్‌పీ 3గనిపై, శ్రీరాంపూర్ ఓసీపీ, ఏరియా వర్క్‌షాప్, ఆర్‌కే 5గని, ఆర్‌కే 6గని, ఆర్‌కే 7గని, మందమర్రిలో అధికారులు, కార్మికులు యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్‌లో యోగాసనాల్లో జీఎం సంజీవరెడ్డి

మందమర్రిలో..

మందమర్రి, జూన్ 21: మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ఆవరణలో యోగా కార్యక్రమానికి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఏ.మనోహర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎల్లందు క్లబ్‌లో క్లబ్ అధ్యక్షురాలు ఏ సవిత మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు యోగా ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎంఎస్ రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటీ యూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, డీవై పీఎంలు మైత్రేయబంధు, ఆసీఫ్, ఏరియాలోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన, జూన్ 21: బెల్లంపల్లి ఏరియా లోని గోలేటి జీఎం కార్యాలయంలో బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం మచ్చగిరి నరేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 21 : రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, అతిసార ఇతర సీజనల్ వ్యాధుల నియంత్రణపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాకుండా అవసరమైన మేర ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొవాలి

వర్షాకాలంలో వచ్చే ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, అదనపు ఎస్పీ. ప్రభాకర్‌రావులతో కలిసి జిల్లా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో భారీ వర్షాలు పడి వరద పరిస్థితులు ఏర్పడే సందర్భాలలో గత అనుభవాల దృష్ట్యా అధికారులు సమన్వయంతో పనిచేసి అప్రమత్తంగా ఉంటూ ప్రజారక్షణ దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని వాగులు, నదులు ప్రవహించే సమయంలో అకస్మాత్తుగా వరదలకు గురయ్యే గ్రామాలను గుర్తించి ఆ గ్రామ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని, ప్రజల సౌకర్యార్థం వెంటనే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని రహదారులు, వంతెనలు, కల్వర్టులు తెగిపోకుండా వెంటనే పనులు పూర్తి చేయాలని, ఆసిఫాబాద్ మండలంలోని గుండి వాగు, కాగజ్ నగర్ మండలంలోని అందవెల్లి వంతెనల స్థితిగతులను పరిశీలించి తగు ఏర్పాటు చేయాలని తెలిపారు. మండలాలలో తహసీల్దారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వరదల సమయంలో జిల్లాలోని సంబంధిత అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి జిల్లాలో ఎలాంటి నష్టం జరగకుండా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

రెబ్బెన, జూన్ 21: మండలంలోని కాగజ్ నగర్ ఎక్స్‌రోడ్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్షెటిపేట కు చెందిన ఎస్‌కె జలీల్(41) మృతి చెందినట్లు రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..లక్షేటిపేటకు చెందిన జలీల్ కాగజ్‌నగర్ మండలం పీహెచ్ ఇజ్‌గాం ప్రభుత్వ దవాఖానలో ఎంఎన్‌వోగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం లక్షేటిపేటలోని తన ఇంటి నుంచి బైక్ పై బయలు దేరి వెళుతున్నాడు. రెబ్బెన మండలం కాగజ్‌నగర్ సమీపంలో స్కూటీ అదుపుతప్పి పడిపోవటంతో జలీల్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా కాజగ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. జలీల్ కుమారుడు ఎస్‌కె అఖిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే గనుల వేలాన్ని వ్యతిరేకిస్తుంది

బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథరావు

శ్రీరాంపూర్, జూన్ 21 : రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సింగరేణిలో గనుల వేలాన్ని వ్యతిరేకిస్తుందని బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథరావు ఆరోపించారు. శుక్రవారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లోవిలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం కిందవేలంలో పాల్గొంటామని చెప్పిన బట్టి విక్రమార్క ఇప్పుడు మాటమార్చి వేలాన్ని వ్యతిరేకిస్తున్నారని అన్నారు. సింగరేణిలో 40 వేల కాంట్రాక్టు కార్మికులను పర్మినెంటు చేయాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల నియోజక వర్గంలో పీఎస్ఆర్ మాయ మాటలు చెప్పి, 3000 మంది రిటైర్డ్ కార్మికులకు ఇంటి స్థలాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారని, వెంటనే వారికి ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు రమేశ్, నాయకులు కమలాకర్‌రావు, అగ్గ మల్లేశం, మహేష్, వెంకటేశ్, మొగిళి, సదానందం, చల్ల విక్రం ఉన్నారు.

మాట్లాడుతున్న వెరబెల్లి రఘునాథరావు

ఉత్పత్తుల నాణ్యత తెలుసుకునేందుకు బీఐఎస్‌కేర్ యాప్ : కలెక్టర్

నస్పూర్,జూన్ 21 : ప్రతినిత్యం మార్కెట్‌లో లభించే అన్ని రకాల ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలు తెలుసుకునేందుకు బీఐఎస్‌కేర్ యాప్ వినియోగదారులకు సాధనంగా ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, బీఐఎస్ శాస్త్రవేత్త సుజాత, ఎస్‌పీవో అభిసాయిలతో కలిసి నాణ్యత పరీక్షలపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అధికారులు జిల్లా స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఐఎస్ఐ ముద్ర ఉన్న వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్నకలెక్టర్ కుమార్ దీపక్

బియ్యం దొంగల అరెస్టు

మంచిర్యాల అర్బన్, జూన్ 21 : మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో గూడ్స్ రైల్ నుంచి 23 బియ్యం బస్తాలను దొంగలించి అక్రమ రవాణా చేస్తున్న నలుగురు దొంగలను శుక్రవారం రామగుండం రైల్వే ఇన్‌స్పెక్టర్ బుర్ర సురేశ్ గౌడ్ అరెస్ట్ చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాలకు చెందిన కొమురం భీం తిర్యాణికి చెందిన గుమ్ముల భీమయ్య, మంచిర్యాలకు చెందిన జనగామ దినేష్, కున్సోత్ వెంకటేశ్, అన్నెల వంశీ యువకులను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరిచామన్నారు. మంచిర్యాలలో గల ఎఫ్‌సీఐ గోదాంకు రైలు మార్గం ద్వారా వచ్చే బియ్యం బస్తాలతో నిండిన గూడ్స్ రైలు మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో ఆగడంతో గమనించిన నలుగురు వ్యక్తులు గూడ్స్ రైలు వ్యాగన్ లోని బియ్యం బస్తాలను కింద వేసి అనంతరం వాటిని మంచిర్యాలలో వారు ఏర్పాటు చేసుకున్న నివాస స్థలానికి తరలించారు. ఆ బియ్యం బస్తాలను మార్కెట్‌లో అమ్మేందుకు వెళ్ళే సమయంలో రైల్వే కానిస్టేబుల్‌లు ఐలయ్య, సుమన్‌లకు వచ్చిన సమాచారం మేరకు గోపాల్‌వాడలో రహస్య నిఘా పెట్టారు. అటుగా బియ్యం బస్తాలను తరలిస్తున్న టాటా ఏసీవాహనం, యువకులను అదుపులోకి తీసుకోని విచారించగా నేరం ఒప్పుకున్నారన్నారు. వారిని రామగుండం రైల్వే మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్‌కి తరలించినట్లు, 23 బియ్యం బస్తాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, జూన్ 21: శ్రీరాంపూర్ ఓసీపీలో, ఉపరితల డిపార్ట్‌మెంటుల్లో పనిచేస్తున్న కార్మికులు విధులకు గైర్హాజరు అయ్యారని ఎస్‌వోటూజీఎం వీ పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఓసీపీ, ఉపరితల డిపార్ట్‌మెంటు సెక్యూరిటీ విభాగంలోని గైర్హాజరు కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు జీఎం ఆఫీస్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌వోటూజీఎం పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ ఉపరితలంలో పనిచేస్తున్న ఉద్యోగులు కనీస మష్టర్లు పనిచేయక పోవడం అంటే వారికి ఉద్యోగం పట్ల, కుటుంబాల పట్ల బాధ్యత లేదని అర్థం అవుతుందన్నారు.13 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారని డీవైజీఎం అరవింద రావు పేర్కొన్నారు. ఈ కార్యరకమంలో ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి కొముర య్య, డీవైసీఎంవో డాక్టర్ రమేశ్‌బాబు, డీవైపీఎంలు రాజేష్, పీ రాజు, సీనియర్ పీవో శంకర్ పాల్గొన్నారు.

ముగిసిన ఈపీ ఆపరేటర్ ట్రైయినీ ప్రాక్టికల్ పరీక్షలు

శ్రీరాంపూర్, జూన్ 21: శ్రీరాంపూర్ ప్రగతీ స్టేడియంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఈపీ ఆపరేటర్ ట్రైనీ ప్రాక్టికల్ పరీక్షలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు 138 మంది కార్మికులు పరీక్షలకు హాజరు కాగా 77 మంది ఎంపికయ్యారని తెలిపారు. నాలుగు రోజుల్లో 543 మంది దరఖాస్తు చేసుకోగా 498 మంది హాజరయ్యారని, ఇందులో 285 మంది కార్మికులు అర్హత సాధించి వ్రాత పరీక్షలకు ఎంపికయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా జీఎం సంజీవరెడ్డి మాట్లాడుతు నాలుగు రోజులుగా అధికారులు శ్రమించి ఈపీ ఆపరేటర్ ట్రైనీ పరీక్షలు విజయవంతంగా నిర్వహించడం పట్ల అభినం దించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం పురుషోత్తంరెడ్డి, పర్యవేక్షణ అధికారి అజయ్‌కుమార్, నిర్వాహణ కమిటీ సభ్యులు ఏరియా ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీవైజీఎం అరవిందరావు, డీజీఎం రవీందర్ పాల్గొన్నారు.

ఆర్ అండ్ ఆర్ సమస్యలను పరిష్కరించాలి

మందమర్రి, జూన్ 21 : సింగరేణిలో ఆర్‌అండ్‌ఆర్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సింగరేణి మంద మర్రి ఏరియా జీఎం ఏ మనోహర్ జిల్లా కలెక్టర్ కమార్ దీపక్ ను కోరారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జీఎం మనోహర్ కలెక్టర్‌ను తన చాంబర్‌లో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్ అండ్ ఆర్ సమస్యలను జీఎం కలెక్టర్ దృష్టికి తీసుకుపోగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించి సాధ్యమైనంత త్వరగా సమస్యలకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.

కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న జీఎం

జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక

కాసిపేట, జూన్ 21 : మంచిర్యాల జిల్లా కాసిపేట మండల కేంద్రానికి చెందిన స్వేరోస్ రాష్ట్ర నాయకులు, సింగరేణి ఉద్యో గి బన్న లక్ష్మణ్ దాస్‌కు బహుజన సాహిత్య అకాడమీ వారిచే అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపిక చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు, అకాడమీ ఫౌండర్ డాక్టర్ నల్లా రాధ కృష్ణ నియామక పత్రాలను అందించారు. జూన్ 25 న హైదరాబాద్‌లో 7వ జాతీయ సదస్సులో అవార్డును ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. విద్యా వ్యాప్తికి, ఈచ్ వన్ టీచ్ టెన్ కార్యక్రమం, హరితహారం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక అంశాలపై కృషికి అవార్డును ఇవ్వనున్నట్లు అకాడమీ నిర్వాహకులు తెలిపారు.

ఎంపిక పత్రాన్ని అందుకుంటున్న బన్న లక్ష్మణ్‌దాస్